



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులు

భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

అధికారులు అంకితభావంతో పని చేయాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష నిర్వహణపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణ, కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ భూ భారతి చట్టాన్ని అమలు చేసేందుకు గాను పైలెట్ ప్రాజెక్ట్ కింద భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహించి అర్జీలను స్వీకరించాలన్నారు. అలాగే నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అలాగే 4న జరిగే నీట్ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి, ఆర్డీవో వాసుచంద్ర, డీఆర్డీఓ శ్రీనివాస్, సీఈఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఈఈ కృష్ణయ్య, నీట్ సిటీ కోఆర్డినేటర్ సాయిలత, తహసీల్దార్లు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న వారికి ట్రాన్స్‌ఫార్మర్లు

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకున్న వారికి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, మీటర్లు, బోరు కనెక్షన్లు సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు. సమీక్షలో ట్రాన్స్‌కో ఎస్ఈ రవి ప్రసాద్, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు అవగాహన

వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వడదెబ్బ నివారణకు జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర శాఖలు తమ ప్రణాళికలకు అనుగుణంగా గ్రామ స్థాయిలో ప్రజలకు సూచనలు అందించాలన్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకూడదని వెళ్లాల్సి వస్తే తలపై టోపి ధరించాలన్నారు. వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బకు అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

ఆటాడుకుందాం!

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం మాదిరిగానే వేసవి సెలవుల్లో ఈసారి కూడా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లాలో 16 చోట్ల శిబిరాలు ఏర్పాటు చేయగా, కొన్నిచోట్ల గురువారం ప్రారంభించగా మరికొన్నిచోట్ల శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆసక్తి కలిగిన క్రీడల్లో నెల రోజుల పాటు శిక్షణ ఇస్తే ఆ తర్వాత సాధన చేస్తూ క్రీడాకారులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో రాష్ట్ర యువజన, క్రీడల అభివృద్ధి శాఖ ప్రతి ఏటా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ వస్తోంది.

- 5 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులకు పలు ఆటల్లో తర్ఫీదు
- జూన్ 6 వరకు కొనసాగనున్న శిక్షణ
- ఒక్కో క్రీడకు ఒక శిబిరం ఏర్పాటు
- వికారాబాద్ జిల్లాలో 16, మేడ్చల్‌లో 23 శిబిరాలు
- గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు ఉచిత శిక్షణ



ఈ క్రీడల్లోనే శిక్షణ

తైక్వాండో శిక్షణ శిబిరాలు మల్కాపూర్, మిట్టకోడూర్, దోమలో ఏర్పాటు చేయగా, ఖోఖో శిక్షణ శిబిరం పరిగి మినీ స్టేడియంలో ప్రారంభించారు. కబడ్డీ శిబిరాలు పెద్ద ఉమ్మెంతాల్, గోకఫస్లావాద్, సుల్తాన్‌పూర్‌లో కొనసాగుతుండగా, కరాటే శిబిరాలు కొడంగల్, గుమ్డాల్‌లో, వాలీబాల్ శిబిరం గోధుమగూడలో, కిక్ బాక్సింగ్ శిబిరం హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఫుట్‌బాల్ శిబిరాలు కొడంగల్, తాండూరులో కొనసాగుతున్నాయి. క్రికెట్ శిక్షణా శిబిరాలు వికారాబాద్ మధుకాలనీ, మిషన్ స్కూల్ గ్రౌండ్, తాండూరు సెయింట్ మార్క్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న శిబిరాల్లో చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనుండగా, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో చేరే చిన్నారులు క్రీడాంశం ఆధారంగా ఒక్కొక్కరు రూ.200 నుంచి రూ.500 వరకు చెల్లించాల్సి ఉంటుంది.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు షురూ

వికారాబాద్/మేడ్చల్, మే 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏడాదంతా విద్యార్థులు చదువుల్లో నిమగ్నమవడం వల్ల ఆటలకు తగిన సమయం కేటాయించడం లేదు. పాఠశాలలకు సెలవులు ఉండే వేసవిలో విద్యార్థుల సమయాన్ని వృథా చేయకుండా క్రీడల్లో నైపుణ్యం సాధించేందుకు సెలవులను సద్వినియోగ పరచుకోవాలనే లక్ష్యంతో ఈ శిబిరాలు కొనసాగిస్తున్నారు. ఈ శిబిరాల్లో అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్, కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. పట్టణ కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నారు.



ఫుట్‌బాల్ శిక్షణ శిబిరంలో చిన్నారులు

క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు...

జిల్లా యువజన క్రీడల శాఖ వేసవిలో ఐదేళ్ల నుంచి పద్నాలుగేళ్ల లోపు చిన్నారులకు క్రీడలపై ఆసక్తి కలిగించి వారిలో క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూ వస్తోంది. మే ఒకటి నుంచి జూన్ 6వ తేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగనున్నాయి. జిల్లాలో 20 మండలాల పరిధిలో 16 క్రీడా శిక్షణా

మిగతా 8వ పేజీలో...

విద్యాశాఖ ఆధ్వర్యంలో 15 రోజులు

మేడ్చల్ జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు పిల్లలకు పాఠశాలల్లో వేసవి శిబిరాలు నిర్వహించనున్నారు. జిల్లాలోని 31 పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరాలను నిర్వహించనున్నారు. ఇందులో పిల్లలకు యోగా, ఆటలు, ఆంగ్లంలో కమ్యూనికేషన్స్ స్కిల్స్, తబలా, మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో పాఠశాలలో వంద మంది విద్యార్థులను వేసవి శిబిరంలో చేర్చుకోనున్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి కోరారు.

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

» వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, మే 2(ఆంధ్రజ్యోతి): 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ రామకృష్ణరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్ష కోసం జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4,336 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని వివరించారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి తహసీల్దార్ డ్యూటీ మేజిస్ట్రేట్‌గా నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా భూ భారతి అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీసీపీ కోటిరెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, అధికారులు పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి 'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

మేడ్చల్ ప్రతినిధి, మే 2(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి ప్రారంభం కానున్నాయని డీఈఓ విజయకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జూన్ 13 వరకు జరగనున్న పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ పర్యవేక్షిస్తుందన్నారు. మార్చిలో ఫెయిల్ అయిన విద్యార్థులు రీ-కౌంటింగ్, రీ-వాల్యూవేషన్ ఫలితాల కోసం వేచి చూడకుండా సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలని డీఈఓ సూచించారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మే 16లోగా తమ పాఠశాల హెచ్ఎంను కలిసి ఫీజు చెల్లించాలన్నారు.

కాసుల వేటలో ఖాకీలు!



శామీర్‌పేట రాణా.. అక్రమాలకు టికానా!

- ప్రతీ ఫిర్యాదు, కేసుకు ప్రత్యేక రేటు
- బలవంతంగా సెటిల్‌మెంట్లు
- కింది నుంచి పైస్థాయి వరకు ముట్టజెప్పాల్సిందే
- గిఫ్ట్స్, ఖరీదైన వాచీలు ఇవ్వాలంటూ బేరసారాలు
- ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ
- ఫిర్యాదు చేయాలంటేనే జంకుతున్న ప్రజలు



మూడుచింతలపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారింది. నేర రహిత సమాజాన్ని తీర్చిదిద్దడానికి కృషి చేయాల్సిన పోలీసులే కాసుల కక్కుర్తిలో పక్కదారి పడుతున్నారు. ఫిర్యాదు ఏదైనా సరే కింది స్థాయి నుంచి మొదలుకొని పైస్థాయి వరకు కాసులు ముట్టజెప్పాల్సిందే.. కొందరు అధికారులైతే తమకు ఏవైనా గిఫ్టులు ఇవ్వాలని, పెట్రోల్ బంకుల్లో తమ సొంత వాహనాల్లో పెట్రోల్ కొట్టించాలని కూడా బేరసారాలు జరిపినట్లు సమాచారం. ఫిర్యాదు చేసేందుకు వెళ్తే స్టేషన్‌లో వినియోగించే సామగ్రి కొనుగోలుకు డబ్బులు ఇవ్వాలని హుకూం జారీ చేస్తుండడంతో ప్రజలు అటువైపు వెళ్లాలంటేనే జంకుతున్నారు.

బెదిరించి మరీ సెటిల్‌మెంట్లు

శామీర్‌పేట నగర శివారు ప్రాంతం కావడంతో ఇక్కడ వివాదస్పద భూములు, అక్రమ బ్లాస్టింగులు, తగాదాలు, రిసార్ట్స్‌లో పార్టీల పేరిట అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటాయి. ఇదే అదనుగా భావించిన పోలీసులు తమదైన శైలిలో కాసుల వేట ప్రారంభించారు. ఫిర్యాదు చేస్తే చాలు ఫోన్ చేసి 'మీ పై ఫిర్యాదుపై మిమల్ని కలవాలంటూ' పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని రాజీ కుదురుస్తాం లేదా కేసు నమోదు చేస్తాం అని బెదిరించి మరీ సెటిల్‌మెంట్లు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. కొందరు అధికారులు మధ్యవర్తులుగా

మిగతా 8వ పేజీలో...

మానవ హక్కుల కమిషన్‌కు..

ఫిర్యాదు చేసేందుకు శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పోలీసులు డబ్బులు అడుగుతున్నారని అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులే అన్యాయం చేస్తున్నారని మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరి కొందరు సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



డబ్బు వసూళ్లలో నిజం లేదు

శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదుదారుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం నాకు తెలియదు. నా పేరు చెప్పి వసూళ్లు చేస్తున్నారన్న విషయంలోనూ నిజం లేదు. అలాగే మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలియదు. కోర్టు నుంచి ఇప్పటి వరకు నోటీసులు రాలేదు.

-శ్రీనాథ్, సీఐ, శామీర్‌పేట పీఎస్

'అగ్రి స్టాక్ ఫార్మా రిజిస్ట్రేషన్'పై శిక్షణ



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న ఏవోలు, ఏఈవోలు

తాండూరురూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): 'అగ్రి స్టాక్ ఫార్మా రిజిస్ట్రేషన్' అంశంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో వ్యవసాయశాఖ ఏవో, ఏఈవోలకు శిక్షణ ఇచ్చారు. తాండూరు మండల అంతారం రైతు వేదికలో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాండూరు ఏవో కొమరయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బషీరాబాద్, యాలాల, తాండూరు, పెద్దేముల్ మండలాలకు చెందిన ఏవోలు, ఏఈవోలకు అగ్రి స్టాక్ అంటే ఏమిటి? తెలంగాణాలో రైతు రిజిస్ట్రేషన్, అగ్రి స్టాక్ ప్రయోజనాలు, పారదర్శకత, సమర్థవంతమైన సేవా డెలివరీ, కచ్చితమైన భూరికార్డులు, పంట సలహా సేవలు నమోదు చేసుకోవడం తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, పక్కన ఎమ్మెల్యే మల్లారెడ్డి

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

లక్ష్మాపూర్, కేశవరం, జగ్గంగూడలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మూడుచింతలపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రైతులకు సూచించారు. మండలంలోని లక్ష్మాపూర్, కేశవరం, జగ్గంగూడ గ్రామాల్లో గురువారం శామీర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ రైతుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. చిన్నగా ఉన్న ప్రైవేటు స్థలంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని సరిపడా ప్రభుత్వ స్థలం కేటాయించి సమస్యను పరిష్కరించాలని జగ్గంగూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సింహులు యాదవ్, శామీర్‌పేట్ సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, రవి, ఆంజనేయులు, కృపాకర్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు అఖిలేష్‌రెడ్డి, నాగరాజు, నాయకులు మురళీగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భారీగా కురుస్తున్న వర్షం

ఘట్‌కేసర్‌లో భారీ వర్షం

ఘట్‌కేసర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రమైన ఎండకు జనాలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి నల్లని మేఘాలతో ఆకాశం నిండిపోయింది. రాత్రి 7.30 గంటలకు ఈదురు గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం అరగంట పాటు కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలికి మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. కాగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంతో వాతావరణం చల్లబడటంతో జనాలు ఉపశమనం పొందారు.



వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన

- తాండూరు, కొడంగల్‌లో ముస్లింల ర్యాలీలు
- తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాల అందజేత

6

అన్నోజిగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్, మే 2 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ సర్వే నంబర్ 18, 19లోని పార్కుస్థలంలోని అక్రమ నిర్మాణలను శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చి వేశారు. అక్కడున్న 5 ఎకరాల విస్తీర్ణంలో 1992లో లేఅవుట్ చేశారు. దానికి సాయి నగర్ కాలనీ ఫేజ్- 1 కాలనీగా నామకరణం చేశారు. ఇందులో ప్రజాప్రయోజనార్థం 860 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. అనంతరం లేఅవుట్ నిర్వాహకులు బై నంబర్లు వేసి ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాన్ని సైతం విక్రయించారు. దీంతో స్థానికులు కొందరు పార్కు స్థలంను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణలను కూల్చీవేశారు. అక్రమ నిర్మాణలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి హెచ్చరించారు. కాగా, తాము పైసాపైసా పోగుచేసి కొనుగోలు చేసిన స్థలంలో రేకుల ఇళ్లు నిర్మించుకుంటుంటే అధికారులు కూల్చడంపై నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

వామ్మో.. భారీ ట్రాన్స్‌ఫార్మర్!

తాండూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం మీదుగా ఓపెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను కంటైనర్‌లో ఉంచి తరలించారు. మహారాష్ట్రలోని సొలాపూర్‌లో తయారు చేసిన ఈపెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను కంపెనీలకు తరలిస్తున్నారు. ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎప్పుడు చూడని జనం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాండూరు పట్టణ శివారు శివాజీ చౌక్ నుంచి ఇందిరాచౌక్, బస్టాండ్ నుంచి ఈ కంటైనర్ వెళ్లింది. సుమారు 64హైడ్రాలిక్ టైర్లతో ఈ పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను చెన్నైలోని ఓ కంపెనీకి తరలిస్తున్నట్లు సమాచారం. దీన్ని తరలించే క్రమంలో పట్టణంలో విద్యుత్ వైర్లు అడ్డుతగలకుండా స్థానిక విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు


తాండూరు మీదుగా చెన్నైకి తరలిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన

కొడంగల్, తాండూరులో నల్లజెండాలతో ముస్లింల ర్యాలీలు

కొడంగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వినాయక చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు శుక్రవారం స్థానిక జామే మస్జీద్ కమిటీ అధ్యక్షుడు అఫ్రోజ్, మైనారిటీ నాయకులు ఎస్‌బీ.గుల్షన్, హాఫీజ్ ఎండీ.యూసుఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుల్ కరీం, బాసిత్, నసీర్, అఫ్రోజ్‌ఖాన్, షేక్ రుమాన్, ఎండీ.సర్తాజ్‌హుసేన్, ఎండీ.షాకీర్, ఎకే. యూసుఫ్, అజ్మీర్‌ఖాన్ పాల్గొన్నారు.



కొడంగల్ ర్యాలీలో ముస్లింలు

తాండూరు: వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకొని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాండూరు పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ముస్లిం సంఘాల కన్వీనర్ కమల్తార్ జమాత్ ఏ అహ్లె హదీస్, జమాతుల్ ఓలుమా, జమతే ఇస్లామి హింద్ సంఘాల ఆధ్వర్యంలో కేంద్రం తీసుకు వచ్చిన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నల్ల జెండాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బతిసేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆలీం, రాజకీయ నాయకులు అబ్దుల్ రవూఫ్, అప్పు (నయీం), నాయకులు పాల్గొన్నారు.


తాండూరులో..


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్

- జాతీయ రహదారిపై బ్రిడ్జి, మూడు అండర్ పాస్‌లు

ఘట్‌కేసర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఘట్‌కేసర్ మండలంలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తీరనున్నాయి. ఈ రహదారిపై ఒక బిడ్జి, మూడు అండర్ పాస్‌ల నిర్మాణానికి సాంకేతిక అనుమతులను సాధించినట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈసమస్య పరిష్కారానికి అనేక సార్లు ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్‌ల సహకారంతో జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కలిసి సమస్యలను వివరించినట్లు గుర్తుచేశారు. ఘట్‌కేసర్ ఔటర్ జంక్షన్ వద్ద బ్రిడ్జితోపాటు, మైసమ్మగుట్ట కాలనీకి వెళ్లేందుకు భూగర్భవంతెన, ఎన్‌టీపీసీ చౌరస్తా, అంకుషాపూర్ చౌరస్తాలోనూ భూగర్భ వంతెనల నిర్మాణాలకు అనుమతితో పాటు రూ.102కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈనెల 5న నగరంలోని అంబర్‌పేట్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, బాల్ నర్సింహా, మధుసుదన్‌రెడ్డి, శ్రీధర్, అనిల్, పవన్‌సింగ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి విజేతకు కన్సొలేషన్ బహుమతి

శంషాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ పోటీలో పాల్గొన్న వారికి కన్సొలేషన్ బహుమతిని శుక్రవారం ప్రదానం చేశారు. ఈమేరకు శంషాబాద్ డివిజన్‌కు చెందిన టి.పార్థివ్‌కృష్ణ ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. ఆయనకు ఆయన పనిచేసే కార్యాలయంలో కన్సొలేషన్ బహుమతిని సర్క్యులేషన్ సిబ్బంది, స్థానిక జర్నలిస్టులు అందజేశారు. జర్నలిస్టులు దూడల కృష్ణగౌడ్, మైత్రి ఆంజనేయులు ఏసీవో టి.అశోక్. ఆంధ్రజ్యోతి ఏజెంట్ ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పార్థివ్‌కృష్ణకు బహుమతి అందిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది


అంజయ్యకు సమ్మె నోటీసు ఇస్తున్న పెంటయ్య తదితరులు

సమ్మె నోటీస్ అందజేత

తలకొండపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య తెలిపారు. మోదీ సర్కార్ పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల కొమ్ము కాస్తూ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తుందని ఆరోపించారు. తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు డివిజన్ రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మిట్టపల్లి అంజయ్యకు కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. మిల్లర్లు సహకరించాలని పెంటయ్య కోరారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న భీంభరత్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : భీంభరత్

షాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలిపారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో రూ.10లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఆయన నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, చెన్నయ్య, మాజీ సర్పంచ్‌లు బుచ్చయ్య, నాయకులు భార్గవ్‌రామ్, రాజు, యాదయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు


మాట్లాడుతున్న గంప వెంకటేశ్

ఆమనగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వెంకటేశ్ మాట్లాడుతూ కడ్తాల, ముద్విన్‌లో ఈనెల 5న(సోమవారం) జిల్లా పౌరసరఫరాల శాఖ సహకారంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. వానా కాలం పంటల సాగుకు అర్హులైన రైతులందరికీ పీఏసీఎస్ ద్వారా పంటరుణాలు అందించడానికి కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సత్యం, డైరెక్టర్ జోగు వీరయ్య, సీఈవో దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

లింగమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

ఆమనగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు నిట్ట నారాయణ మాతృమూర్తి లింగమ్మ మృతిపట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు సంతాపం ప్రకటించారు. అనారోగ్యంతో మృతిచెందిన లింగమ్మ మృతదేహాన్ని శుక్రవారం వారు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. నిట్ట నారాయణ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జడ్పీటీసీలు అనురాధ పత్యనాయక్, కండె హరిప్రసాద్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు మండ్లీ రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య. బీజేపీ అధ్యక్షులు ఎర్రవోలు శ్రీను, విక్రమ్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

వార సంత.. సమస్యలే అంతా

బషీరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే వార సంతలో సమస్యలు తప్పడంలేదు. సంత వేలం ద్వారా గ్రామ పంచాయతీకి ఏటా రూ.లక్షల ఆదాయం వస్తున్నా సంతలో కనీస సౌకర్యాలు కల్పించడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మౌలిక వసతులు లేక చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు సంతలో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే సంత నిర్వహిస్తుండటంతో ప్రధాన, అంతర్గత రోడ్లన్నీ ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. వర్షంకాలం ఈ సంతలో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. తైబజార్ ట్యాక్స్‌ను వసూళ్లు చేస్తున్న సంతలో సౌకర్యాలు మాత్రం కల్పించడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ, మండల అధికారులకు ఇదంతా తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదని వ్యాపారులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డుపైనే బషీరాబాద్ సంత

ఘనంగా రామానుజాచార్యుల జయంతి

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో స్వర్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు

శంషాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో భగవత్ శ్రీ రామానుజాచార్యుల 1008 జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఆర్ద్ర నక్షత్ర రోజున ఉదయం తెల్లవారుజామున స్వర్ణ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. 108 దివ్య దేశాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులు, రామానుజాచార్యుల జయంతి వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి వేడుకల సందర్భంగా భక్తులకు ఉచిత దర్శనాలకు అనుమతించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన జీయర్‌స్వామి ఆలయ ప్రారంభం నుంచి నేటి వరకు ఎప్పుడు ఉచిత దర్శనాలకు అనుమతి ఇవ్వలేదు. కానీ, భవత్ రామానుజాచార్యుల జయంతి వేడుకల్లో భక్తులకు ఉచిత దర్శనాలకు అనుమతిచ్చారు. అనంతరం చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ.. వెయ్యేళ్ల కిందటే రామానుజాచార్యుల వారు కుల, మతాలను రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. మనుషుల సమానత్వం కోసం కృషి చేశారని చెప్పారు. డబ్బు వాయిద్యాలతో గిరిజనులు నృత్యాలు చేశారు. ఉత్తమ కళాకారులకు సర్టిఫికెట్లు, మంగళశాసనములు అందించారు. ఉచిత దర్శనం ఇవ్వడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో స్వర్ణ విగ్రహానికి, 108 దివ్య దేశాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



పాడిరైతులకు బాసట..
పశువుల షెడ్ల నిర్మాణం

- చేవెళ్ల మండలానికి 20 మంజూరు
- 13 షెడ్ల నిర్మాణం పూర్తి.. ఒక్కోదానికి రూ.80 వేల ఖర్చు

చేవెళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూములు ఉండి ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం పశువుల కొట్టాలు మంజూరు చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో పశువుల కొట్టాలు మంజూరు చేసింది. ఇందులో భాగంగా చేవెళ్ల మండలలానికి 2024-25 సంవత్సరానికి 20 పశువుల పాకలు మంజూరయితే.. 13 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా షెడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మండలంలో 29 గ్రామ పంచాయతీల పరిధిలో గత మూడు నెలలుగా షెడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి.


మల్లారెడ్డిగూడలో నిర్మించిన పశువుల షెడ్డు


కమ్మెట గ్రామంలో నిర్మించిన పశువుల షెడ్డు

ఒక్కో షెడ్డుకు రూ.80 వేలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగు పశువులు ఉన్న వారికి షెడ్డును మంజూరు చేస్తారు. ఒక్కో షెడ్డుకు రూ.80 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. రూ.30 వేలు లేబర్ ఖర్చు పోగా.. రూ.50 వేలు మెటీరియల్‌కు ఇస్తున్నారు. 18 అడుగుల పొడువు, 15 అడుగుల వెడల్పుతో షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటి వరకు మండలం వ్యాప్తంగా షెడ్డు నిర్మించుకున్న లబ్దిదారులకు నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వ నిర్ణయించిన కొలతల ప్రకారమే కొట్టాల నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ఈమేరకు పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

రైతులకు ఎంతో ఉపయోగం



పశువుల షెడ్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. చేవెళ్ల మండలంలో పశువుల షెడ్లు నిర్మించుకున్న రైతులందరికీ బిల్లులు చెల్లించాం. ఇప్పటివరకు 13 నిర్మాణాలు పూర్తయ్యాయి. అర్హత, అవసరం ఉన్న రైతులను గుర్తించి యూనిట్ మంజూరు చేస్తాం. షెడ్డు నిర్మించుకునేందుకు సొంత స్థలం ఉంటే చాలు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారమే షెడ్లు నిర్మించుకోవాలి.

- హిమబిందు, ఎంపీడీవో, చేవెళ్ల

షెడ్డు నిర్మాణం సంతోషకరం



మాకు షెడ్డు నిర్మించేందుకు యూనిట్ మంజూరు కావడం సంతోషంగా ఉంది. ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల షెడ్డు మంజూరైంది. అధికారులు సూచించిన కొలతల ప్రకారం నిర్మించుకున్నాం. మా పశువులను కట్టివేసుకునేందుకు షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ పథకంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

- మల్గారి రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డిగూడ

సిబిల్ స్కోర్ బాగుంటేనే రుణాలు

- రాజీవ్ యువ వికాస్ రుణాలపై బ్యాంకర్లతో అధికారుల సమీక్ష


రాజీవ్ యువ వికాస్ రుణాలపై బ్యాంకర్లతో సమీక్షిస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): సిబిల్ స్కోర్ ఆధారంగా అర్హులకే రాజీవ్ యువ వికాస్ రుణాలు అందిస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాజీవ్ యువ వికాస్ రుణాల పథకం రుణాల అందజేతపై బ్యాంకర్లతో ఎంపీడీవో విశ్వప్రసాద్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ 1251, ఎస్సీ కార్పొరేషన్ కింద 548, ఎస్టీ కార్పొరేషన్ కింద 112, మైనార్టీ కార్పొరేషన్ 240, ఎంబీసీ కింద 21, ఈబీసీ కింద 37 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. అయితే వీటిలో బ్యాంకర్స్ కమిటీ అధ్యక్షతన సిబిల్ స్కోర్ ఆధారంగా వారి అర్హతను బట్టి ఎంపిక చేయనున్నట్లు బ్యాంకు అధికారుల బృందం సమీక్షలో నిర్ధారించారు. బ్యాంకర్స్ కమిటీలో ఎంపీడీవోతోపాటు డీఆర్‌డీఏ ప్రతినిధులు, అధికారులు దరఖాస్తులను సెలెక్షన్ కమిటీ తుది నిర్ణయం మేరకు యూనిట్లను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకర్స్ కమిటీ ప్రతినిధులు, ఎస్‌బీఐ బ్యాంకు ప్రతినిధి శ్రావణి, గ్రామీణ బ్యాంకు రాజేష్, ఎస్‌బీఐ కరన్‌కోట్ పురుషోత్తం, యూనియన్ బ్యాంకు ప్రతినిధి చేతన్, మండల పంచాయతీ అధికారి సునిల్ కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

తాండూరు మండలంలోని ఆయా గ్రామాల నుంచి రాజీవ్ యువ వికాస్ పథకానికి 2219 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్, మండల పంచాయతీ అధికారి సునిల్‌కుమార్‌లు తెలిపారు. అట్టి దరఖాస్తులను శుక్రవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కులం, ఆదాయం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు బాలకృష్ణ, సత్యనారాయణరెడ్డి, రవి, నర్సిరెడ్డి, వీరప్ప తదితరులున్నారు.

కులగణన ఘనత రాహుల్‌దే


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర క్యాబినెట్ జనగణనతో పాటు కులగణన చేయాలని తీర్మానించడం రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్ర విజయమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్రం ప్రకటించటం హర్షణీయమన్నారు. కులగణన కోసం రాహుల్ గాంధీ అన్ని రాష్ట్రాల్లో నిర్వహించిన జోడోయాత్రలో ముందే చెప్పారని ఆయన గుర్తుచేశారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేసి దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచారని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్‌కు ఎక్కడ ఘనత తగ్గుతుందోనన్న అక్కసుతో హడావిడిగా ప్రకటనలు చేశారని విమర్శించారు. తెలంగాణను మోడల్‌గా తీసుకుని కేంద్రం అన్ని రాష్ట్రాల్లో వీలైనంత త్వరగా కులగణన సర్వే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, నాగభూషణం, రమేష్, మహేష్, మల్లేష్‌గౌడ్, కొండల్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రాజు, సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, భక్తులు

కొత్తూర్, మే 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీ పల్లిలోని బీరప్ప స్వామి దేవాలయం పునర్నిర్మాణం, బీరప్ప ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మొదటి ఘట్టం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలతో బీరప్ప కామరాతిదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఉప ఆలయాలకు చెందిన మహంకాళి, బుగ్గ పోచమ్మ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయం ముఖద్వారం వద్ద ఏకశిల ధ్వజస్తంభం, గర్భాలయ గోపురాలపై శిఖర కలశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కురుమ కులస్తుల ఆధ్వర్యంలో యజ్ఞ క్రతువు నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కొత్తూర్ మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతా సత్యనారాయణ, నాయకులు కడాల శ్రీశైలం, వెంకటయ్య, అజయ్, పాండు, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నగ్రామాల అభివృద్ధి కృషి


గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): చిన్న గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన బొట్టిగూడ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చిన్న గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో 500 ఓట్లు ఉన్న వాటిని పంచాయతీలుగా మార్చుతున్నామని చెప్పారు. ఇంతకుముందు రామంజాపూర్ అనుబంధ గ్రామంగా ఉన్న బొట్టిగూడను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏళ్ల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దృష్టికి రాగానే ప్రపోజల్స్ పంపి నూతన జీపీగా ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా పనిచేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ తన్వీ రాజు, పీఏసీఎస్ చైర్మన్ దొనకర్‌గౌడ్, వైస్ చైర్మన్ ప్రభుసాగర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ విశాల

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

చౌదరిగూడ, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాలా శ్రవణ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షురాలు పిట్ల రజితలు అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. త్వరలో మండలంలో నిర్వహించనున్న జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రపల్లి రాజు, మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, బీసీ సెల్ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎఎంసీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సలీం, భాస్కర్, బాల్‌రాజ్, పాపయ్య, నర్సింలు, అజ్జు, హసన్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఫ్రీజర్

- పట్టించుకోని అధికారులు



కీసర, మే 2 (ఆంధ్రజ్యోతి): ఫ్రీజర్ బాక్స్ చెడిపోయి రోజులు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కొంతకాలం కిందట మాజీమంత్రి, స్థానిక మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన సొంత నిధులతో అంత్యక్రియలకు నిధులు సమకూర్చారు. మండలంలోని ప్రతీ గ్రామంలో ఎవరైనా మృతిచెందితే భౌతికకాయాన్ని తరలించేందుకు వాహనం, మృతదేహం రాత్రిళ్లు నిల్వ చేసేందుకు ఫ్రీజర్లను విరాళంగా అందజేశారు. అందులో భాగంగానే కీసరకు కూడా ఒక వాహనం, ఫ్రీజర్ విరాళంగా ఇచ్చారు. అయితే కొన్ని రోజులుగా ఫ్రీజర్ చెడిపోయి మూలన పడింది. దీంతో గ్రామంలో ఎవ్వరైనా రాత్రి సమయంలో మృతి చెంది, మృతదేహాన్ని నిల్వచేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని అవుతోంది. ఇటీవల కీసరకు చెందిన ప్రజాప్రతినిధి సతీమణి కాలం చేసే, ప్రైవేట్ ద్వారా ఫ్రీజర్‌ను ఉపయోగించాల్సి వస్తోందని గ్రామస్తులు తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ ఫ్రీజర్‌కు మరమ్మతులు చేసి, ఉపయోగంలోని తీసుకురావాలని అధికారులను కోరుతున్నారు.

తెలంగాణలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

కీసర రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని క్రాంతి కీన్ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ కళ్యాణి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూల్స్‌లో హోమ్ స్టేట్ కోటా ప్రవేశాలను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆమె శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర మంత్రుకు, ఎంపీలకు ఓ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణాలోని విద్యార్థులకు హోమ్ స్టేట్ కోటా కింద ఆంధ్రప్రదేశ్‌లోని కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలు కల్పించేవారని, ఆకస్మాత్తుగా ఈ కోటాను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇప్పటికే పరీక్షలు రాసిన విద్యార్థులకు నాన్‌లోకల్ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వానాకాలం పంట రుణాలకు ప్రణాళికలు సిద్ధం

● పరిగి పీఏసీఎస్ సీఈవో అమరేందర్‌రెడ్డి



ఫేస్ టు ఫేస్

పరిగి, మే 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే వానాకాలం సీజన్‌కు గానూ పంటరుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పరిగి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో బి.అమరేందర్‌రెడ్డి తెలిపారు.

ఆంధ్రజ్యోతి: వానాకాలం పంటరుణాల లక్ష్యమేమిటి.?

సీఈవో: లక్ష్యమంటూ ఏమీలేదు. రైతులకు రుణమాఫీ 50శాతం మాత్రమే వచ్చింది. కొంత మందికి రావాల్సిఉంది. వచ్చినవారికంతా తిరిగి రుణాలు ఇచ్చాం. కొత్తవారికి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. కొత్త రైతులకు జూన్‌లో చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సంఘం టర్నోవర్ ఎంత?

సీఈవో: అన్ని రకాల రుణాలు కలిపి రూ.35కోట్ల లావాదేవీలు నడుస్తున్నాయి. 4834 మంది సభ్యులు ఉండగా, ఇందులో 2032 మందికి వివిధ రకాల రుణాలు ఇవ్వడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: ఎంతమందికి రుణాలు ఇచ్చారు?

సీఈవో: 1550 మంది రైతులకు రూ.9.20కోట్ల పంటరుణాలు, 482 మంది రైతులకు రూ.25.10 కోట్ల దీర్ఘకాలిక రుణాలు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: బంగారంపై రుణాలు ఇస్తున్నారా?

సీఈవో: బంగారం గంటల వ్యవధిలోనే ఇస్తున్నారు. సంఘం నుంచి ఇప్పటి వరకు రూ.3.50కోట్ల బంగారంపై రుణాలు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: పెండింగ్ వసూళ్ళపై చర్యలేమిటి.?

సీఈవో: గతేడాదిలో రూ.కోటి 20లక్షల లాభాలను ఆర్జించాం. దీర్ఘకాలిక రుణాల్లో 25శాతం రికవరీ, జూన్ ఆఖరునాటికి వంద శాతం లక్ష్యం పెట్టుకున్నాం. అలా అయితేనే కొత్తవారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుంది.

ఆటాడుకుందాం!

(ఐదో పేజీ తరువాయి)

శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడకు సంబంధించి ఒక శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఒక్కో శిబిరంలో 20 మంది నుంచి 40 మంది వరకు చిన్నారులు ఉండే విధంగా ప్రయత్నం చేస్తున్నారు. వివిధ క్రీడాంశాల్లో చిన్నారులకు శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించారు. శిక్షణా శిబిరాలకు వారు ఇన్‌చార్జీలుగా, కోచ్‌లు వ్యవహరించనున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఎంపిక చేసుకున్న క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు.



మేడ్చల్‌లో ప్రారంభమైన క్రీడా శిక్షణ శిబిరం

మేడ్చల్ జిల్లాలో 23 కేంద్రాలు



వికారాబాద్: శిబిరాల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

రాష్ట్ర యువజన క్రీడా శాఖల ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాలో మొత్తం 23 కేంద్రాల్లో క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. పాఠశాల మైదానాలు, ప్రైవేటు ప్లే గ్రౌండ్, స్పోర్ట్స్ అకాడమీలను శిబిరాలుగా ఎంపిక చేశారు. విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి కలిగించడంతో పాటు, ప్రతిభావంతులును గుర్తించి వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధ చేయాలనే ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జీవీ గోపాల్‌రావు మాట్లాడుతూ క్రీడలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతాయన్నారు. ఈ శిబిరాలను విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచే విధంగా రూపొందించామన్నారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదల ఆరోగ్యానికి అండ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లిలో శుక్రవారం రాఘవేందర్‌రెడ్డికి రూ.50వేలు, ముక్రమ్‌కు రూ.50వేలు, వెంకటమ్మకు రూ.75వేలు, ఈర్లపల్లి కృష్ణకు రూ.62,500, మ్యాదరి అరుణకు రూ.75వేలు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు.

కాసుల వేటలో ఖాకీలు!

(5వ పేజీ తరువాయి)

కిందిస్థాయి సిబ్బందిని నియమించుకుని సెటిల్‌మెంట్ల దందా కొనసాగిస్తున్నా రన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గతంలో శామీర్‌పేట్ పీఎస్‌లో విధులు నిర్వహించిన కొందరు అధికారుల తీరుపై పలు ఆరోపణలు రావడంతో సీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



అక్రమంగా మద్యం విక్రయాలకు..

మూడుచింతలపల్లిలోని ఓ భూవివాదంలో కేశవరం గ్రామంలో జరిగిన తగాదాల్లో పోలీసులు అక్రమంగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. హైవేపై గ్రామాల్లో ఉన్న దాబాల్లో మద్యం అమ్మకాలకు, రిసార్ట్‌లో పార్టీలు నిర్వహించేందుకు వారికి కాస్ట్‌లీ వాచ్‌లు ఇప్పించాలని డిమాండ్ చేసినట్లు ప్రచారం జరిగింది. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలు, రవాణా చేస్తున్న మట్టి టిప్పర్లు ఇలా చాలా సందర్భాల్లో సుమారు ఒక్కో వ్యక్తి వద్ద నుంచి సుమారు రూ.20 వేలకు పైగా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారి హస్తం?

లంచం తీసుకుంటూ ఓ ఎస్‌ఐ ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ డబ్బులు డిమాండ్ విషయంలో ఓ ఉన్నతాధికారి హస్తం కూడా ఉందని భావించిన ఏసీబీ అధికారులు తెల్లవారుజామున 3 గంటల వరకు పీఎస్‌లో సోదాలు నిర్వహించారు. దురదృష్టం కొద్ది ఎస్సై చిక్కాడు అదృష్టం మరో ముగ్గురు తప్పించుకున్నారని పీఎస్‌లోని పోలీసులే మాట్లాడుకోవడం గమనార్హం. ఈ కేసులో ఏసీపీ రాములుతో పాటు మరో ఎస్సై దశరథ్ ఇద్దరు కానిస్టేబుల్స్‌ను విచారించినట్లు తెలిసింది. 24 గంటలు నిఘా విభాగాన్ని పటిష్టం చేశాం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం అని చెప్పే ఉన్నతాధికారి తన పోలీస్ స్టేషన్‌లో ఏం జరుగుతుందో తెలియదంటే నమ్మశక్యంగా లేదని పలువురు అనుమానిస్తున్నారు.

ఒక్కో పనికి ఒక్కో రేటు

ఇటీవల నారాయణపూర్ గ్రామంలో ఓ భూవివాదంలో సుమారు రూ. 2 లక్షలు మూడుచింతలపల్లిలోని పాఠశాలలో ప్రోగ్రాం నిర్వహించినందుకు రూ. 25 వేలు, ఓ అన్నదమ్ముల తగాదాలో రూ.30 వేలు, రెస్టారెంట్ వద్ద రూ.50 వేలు, బెల్టు షాపుల వద్ద రూ.20 వేలు, అక్రమ బ్లాస్టింగ్‌ల వద్ద రూ.2 లక్షలు, వాహన తనిఖీలలో, ప్రమాద కేసుల్లో, తూంకుటల్లో వ్యాపారస్తుల వద్ద రూ. 30 వేలు, ఉప్పర్‌పల్లి భూ వివాదం వద్ద రూ 1.5లక్షలు, తూంకుంట భూ వివాదాంలో రూ. లక్ష ఇలా చాలా వరకు భూ వివాదాల్లో భారీగానే డబ్బులు వసూలు చేశారని ఈ వసూళ్ల వెనక పైఅధికారులు సైతం ఉన్నారని, వారంతా వాటాలు వెసుకుని మరీ పంచుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మోమిన్‌పేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో శుక్రవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈవో శేఖర్, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, విజయేందర్‌రెడ్డి, నాయకులు సుభాష్ గౌడ్, సురేందర్, సిరాజుద్దీన్, నర్సింహులు, మహంత్, సిబ్బంది రవి, బాలయ్య, రమేశ్, సురేందర్‌రెడ్డి, మహమూద్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామానుజ జయంతి సందర్భంగా స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సోలార్ ప్లాంట్‌లో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

పెద్దేముల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇందూర్ సోలార్ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోలార్‌ప్లాంట్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి ఇందూర్ సోలార్ ప్లాంట్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి నైట్‌డ్యూటీ ఉందని ఇంట్లో చెప్పివెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున సోలర్ పవర్ ప్లాంట్‌లో ఉరేసుకొని కనిపించాడు. ఈ విషయాన్ని స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో రాజశేఖర్‌రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి అక్కడికి వెళ్లి చూడగా ఉరేసుకొని ఉన్నాడని తెలిపారు. సోలార్ ప్లాంట్‌లోని ఎం జరిగిందో విచారణ జరిపించాలని తండ్రి బాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్లాంట్ యజమాని వచ్చేంత వరకు మృత దేహాన్ని తీయమని ఎలక్ట్రీషియన్ మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబీకులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేపడుతామని పోలీసులు కుటుంబీకులకు హామీ ఇచ్చారు. పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని వారికి అప్పగించారు. పెద్దేముల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పరిగి, మే 2 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లలో చోరీలకు పాల్పడుతున్న ముఠాలో ప్రధాన నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు పరిగి డీఎస్పీ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేఖరులకు వెల్లడించారు. ఏపీలోని నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన గుంజల గిద్దన్న, అతని భార్య ఆగిరమ్మ, కూతురు కీర్తి, గిద్దన్న బావ ప్రసాద్‌లంతా ఒక ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఏప్రిల్ 17న పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో కొయిల్‌కొండ మండలం కొండాపూర్‌కు చెందిన పోలీస్ పుష్ప దగ్గర బంగారం, హైదరాబాద్‌కు చెందిన కాశప్ప దగ్గర నగదును అపహరించిన సంగతి తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును చేపట్టారు. బస్టాండ్‌లో సీసీ ఫుటేజీ ఆధారంగా నలుగురు నిందితులను గుర్తించారు. వీరిలో ముగ్గురు ఆగిరమ్మ, కీర్తి, ప్రసాద్‌లను మూడు రోజుల క్రితమే రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడైన గిద్దన్నను శుక్రవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద మూడు తులాల బంగారం, రూ.13వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గిద్దన్నపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 14కేసులు ఉన్నాయి. ఆగిరమ్మపై పెబ్బేరు, వనపర్తి, పంజాగుట్ట పీఎస్‌లలో కేసులు ఉన్నాయి. ఈ సమావేశంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



హనుమంత్ మృతదేహం

మూడుచింతలపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పోచంపల్లి హనుమంత్(48) వృత్తిరీత్యా క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబకలహాల కారణంగా శామీర్‌పేట్ బ్రిడ్జి వద్దకు వచ్చి తాను బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో బంగారు చైన్ చోరీ

తాండూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మహిళ మెడలో నుండి బంగారు చైన్ చోరీ చేసినట్లు తెలిసింది. మహిళ మెడలో ఉన్న సుమారు 3తులాల బంగారు చైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారని సమాచారం. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్‌కు చెందిన ఓమహిళ తాండూరు పట్టణం సాయిపూర్ రోడ్డుమార్గంలో ఉంటున్న కూతురు ఇంటికి వచ్చింది. శుక్రవారం ఆమె సొంతూరు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చింది. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు హడావిడిలో ఉన్న ఆమె మెడలోని చైన్‌ను కత్తిరించి దొంగిలించారు. కొద్దిసేపటికి తేరుకున్న ఆమహిళ మెడలో చైన్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. కుటుంబీకుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఇందకు సంబంధించిన పూర్తివివరాలను పోలీసులు వెల్లడించలేదు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కులకచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

కులకచర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. కులకచర్లలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, ఏపీయం శోభ, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



దుస్తులు అందిస్తున్న మాజీ సర్పంచ్ శేఖర్

చౌడాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకల్‌పల్లికి చెందిన మల్కమ్మ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మూడు రోజుల కిందట ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్ర ఆస్తి నష్టం జరిగిన బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ శేఖర్ చేయూతనందించారు. తన వంతుగా శుక్రవారం దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, బాల్‌రాజ్, శ్రీనివాసులు, సుధాకర్, మాసయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చౌడాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలు, తండాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్, లింగ్యానాయక్ అన్నారు. మండలంలోని అడవి వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఈదుల ధర్మనాయక్ తండాలో శుక్రవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవ్‌జనాయక్, భాస్కర్‌నాయక్, తండావాసులు పాల్గొన్నారు.

తాండూరులో చీఫ్‌విప్ సుడిగాలి పర్యటన



కోర్వార్ మల్లిఖార్జున్‌కు నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలో ప్రభుత్వ చిఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. పర్యటనలో తాండూరు పట్టణంలోని కోర్వార్ మల్లికార్జున్ దశదిన కర్మలో పాల్గొని కుటుంబ సభ్యులను, ఇటీవల మృతి చెందిన డీసీఎంహెచ్ జనరల్ మేనేజర్ పగడాల గోపాల్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ రుద్రారం లక్ష్మారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరుణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

బషీరాబాద్: బషీరాబాద్ ఏఎంసీ డైరెక్టర్ కోవ్వూరునరేష్ తండ్రి ఎల్లప్ప(80) స్వగ్రామమైన దామర్‌చెడ్‌లో గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి శుక్రవారం ఇంటికి చేరుకుని ఎల్లప్ప భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సీనియర్ నేత కరుణం పురుషోత్తం రెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్ ఉన్నారు.

యాలాల: నాగసముందర్ గ్రామానికి చెందిన సురేందర్ హఠాన్మరణం చెందగా విషయం తెలుసుకున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి పీసీసీ నాయకులు కరణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటయ్యతో కలిసి నాగసముందర్ వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కూతురు సుహాసిని పైచదువుల నిమిత్తం తన వంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. మహేందర్‌రెడ్డి వెంట నాయకులు అనంతప్ప, నర్సింహులు, అరుణ్ తదితరులు ఉన్నారు.

తాండూరు రూరల్: సంగెంలాన్ గ్రామానికి చెందిన జయశంకర్‌గౌడ్ కుమారుడు కిషోర్‌కుమార్‌గౌడ్ బుధవారం మృతి చెందాడు. దీంతో ఆయన అంత్యక్రియలు గురువారం జరుగాయి. విషయం తెలుసుకున్న చీఫ్‌విప్ శుక్రవారం తాండూరు పట్టణంలోని కిషోర్‌కుమార్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతికిగల కారణాలను జిల్లా డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, పీఏసీఎస్ మాజీచైర్మన్ ఎస్.నారాయణగౌడ్, మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్‌లను అడిగి తెలుసుకున్నారు.

'చలో ఏర్పుమళ్ల' పోస్టర్ ఆవిష్కరణ



విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్

దుద్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న సాయంత్రం 5 గంటలకు బొంరాస్‌పేట్ మండలంలోని ఏర్పుమళ్ల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం దుద్యాల మండల కేంద్రంలో చలో ఏర్పుమళ్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాములు, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మోమిన్‌పేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ సిరాజుద్దీన్ అన్నారు. కేసారంలో శుక్రవారం పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, చంద్రయ్య, మహంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం



యాలాల: విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈవో రమేష్, పీఆర్టీయూ శాఖ ప్రతినిధులు

యాలాల, మే 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు యాలాల మండల పీఆర్టీయూటీఎస్ శాఖ ఆధ్వర్యంలో సత్కరించి బహుమతులు అందజేశారు. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు చైతన్య, పూజ, మనూషలు మంచి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ శాఖ శాలువాతో సత్కరించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎంఈవో రమేష్, పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాములు, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.మహేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు శెట్టి విజయ్‌కుమార్, రాంచందర్, వెంకటయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొడంగల్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్ సన్మానించారు. స్థానిక నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదోతరగతిలో విద్యార్థులు మహీన్, సాయిశ్రీ, వైష్ణవి, బిందు, బిలాల్, అక్షిత, శరత్, శివశంకర్, శ్రీహరి, శివప్రసాద్, జస్వంత్‌లు మెరుగైన ఫలితాలు సాధించి టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డి.వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పరిగి: మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పరిగి, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జన, కులగననణపై ప్రధాని మోదీ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ, బీజేపీ ఓబీసీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిగిలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాంచంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రాముయాదవ్, కార్యదర్శి వి.పెంటయ్య, పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, ఆంజనేయులు, కె.శ్రీశైలం, విజయ్ పాల్గొన్నారు.

కులకచర్ల: కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడం హర్షం వ్యక్తం చేస్తూ బీసీ సంఘాలు, బీజేపీ నాయకులు కులకచర్ల చౌరస్తాలో శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, వెంకటయ్యగౌడ్, జానకిరామ్, మైపాల్, నరేశ్ పాల్గొన్నారు.



కులకచర్లలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు